క్లుప్తంగా

దీన్ దయాళ్ ఉపాధ్యాయకు బీజేపీ నివాళి



పండిత దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కొవ్వూరు: పండిత దీన్‌దయాళ్ ఉపాధ్యాయ బలిదాన దివస్‌ను బీజేపీ నాయకులు శనివారం స్థానిక పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.అంత్యోదయ ద్వారా చివరి వరకు ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాల్సిన అవసరం ఉందని ఆనాడే గుర్తించిన మహోన్నత వ్యక్తి దీన్‌దయాళ్ అన్నారు. నేడు సబ్ సాత్ సబ్‌కా విశ్వాస్ పేరుతో నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ప్రయాణిస్తోందని బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు బీవీ ముత్యాలరావు పేర్కొన్నారు.బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నీరుకొండ సూర్యనారాయణ, మడిచర్ల రామచంద్రరావు, కొండపల్లి రత్న సాయి, పిల్లలమర్రి మురళీకృష్ణ, టీఎస్‌వీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమిశ్రగూడెం బ్రిడ్జి వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం



నిలిచిపోయిన ట్రాఫిక్

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం వద్ద శనివారం భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. గృహోపకరణాలు తీసుకువెళుతున్న వాహనం గడ్డర్‌ను ఢీకొట్టడంతో వాహనాలు బారులు దీరాయి. సుమారు గంటసేపు వాహనలు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమిశ్రగూడెం పోలీసులు బ్రిడ్జి వద్దకు చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

గోపాలపురం: మండలంలోని వాదాలకుంట గ్రామానికి చెందిన ఇంజే దివ్య అనే బాలిక అదృశ్యమైంది. దీనిపై ఆమె తల్లి సౌందర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్టు గోపాలపురం ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపారు. దివ్య గురువారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని, రెండు రోజులుగా చుట్టుపక్కల గ్రామాల్లో విచారించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

మోటార్ సైకిల్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన జాలాది ఆశీర్వాదం (70) అనే వృద్ధుడు గాయపడ్డాడు. ఉదయాన్నే పొలానికి వెళ్లి పాలు తీసుకుని సైకిల్‌పై తిరిగి ఇంటికి వస్తున్న ఆ వృద్ధుడ్ని మోటార్ సైకిల్‌పై వస్తున్న మరో వ్యక్తి ఢీకొట్టాడు. తలకు బలమైన గాయమైన ఆశీర్వాదాన్ని పెరవలి 108 సిబ్బంది హుటాహుటిని తణుకు ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

జీవీని కలసిన ట్రస్టుబోర్డు సభ్యురాలు

దేవరపల్లి: చిన తిరుపతి వేంకటేశ్వరస్వామి ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా నియమితులైన ద్వారకాతిరుమలకు చెందిన పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, జ్యోతి శ్రీనివాస్ దంపతులు శనివారం మండలంలోని పల్లంట్లలో క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) ను కలసి ఘనంగా సన్మానించి, స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, పార్టీ దేవరపల్లి మండలశాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, సోషల్ మీడియా నియోజకవర్గ కో–కన్వీనర్ మతుకుమిల్లి సీతారామబ్రహ్మం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కడిమి రాజు పాల్గొన్నారు.

నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

చాగల్లు: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం చాగల్లులో శనివారం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన సంఘాధ్యక్షుడు కోడి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫిబ్రవరి నెలాఖరులోగా సర్వీసు పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను సంబంధిత ట్రెజరీల్లో అందజేయాలన్నారు.చిన్నాయిగూడెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు మృతికి సభ్యులు మౌనం పాటించి, ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు డేగల నాగేశ్వరరావు, కార్యదర్శి కేఎస్ఎన్ మూర్తి, కోశాధికారి ఎ.రామారావు, వెచ్చా గంగాధరం, బచ్చు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు

గడప గడపతో సమస్యలకు మోక్షం

- గ్రామాల్లో చురుగ్గా పనులు
- సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున మంజూరు

చాగల్లు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోంది. వివిధ సంక్షేమ పథకాల ద్వారా గత మూడున్నరేళ్లలో ప్రభుత్వం ప్రజలకు చేకూర్చిన లబ్ధిని వివరించేందుకు గ్రామాలకు వెళ్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు, స్థానికులు పలు సమస్యలు సైతం విన్నవిస్తున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులను సైతం మంజూరు చేస్తున్నారు.

అపూర్వ స్పందన....

కొవ్వూరు నియోజకవర్గంలోని చాగల్లు మండలంలో 13 పంచాయతీలకు గాను తొమ్మిది పంచాయతీల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఇప్పటికే పూర్తయ్యింది. మిగిలిన పంచాయతీల్లో కూడా త్వరలోనే ఈ కార్యక్రమం పూర్తవుతుందని మండల స్థాయి అధికారులు చెబుతున్నారు. మండలంలో మొత్తం 18 సచివాలయాలు



కలవలపల్లిలో నిర్మాణంలో ఉన్న సీసీ డ్రైన్

ఉన్నాయి. ప్రతి సచివాలయం పరిధిలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పన మంజూరు చేసింది. ఆ నిధులతో ప్రస్తుతం బ్రాహ్మణగూడెం, నందిగంపాడు, ఎస్. ముప్పవరం, చంద్రవరం, కలవలపల్లి–1, 2 సచివాలయాల పరిధిలో 36 పనులు మంజూరయ్యాయి. ఈ పనుల కోసం రూ 1.20 కోట్లు వెచ్చిస్తున్నారు. మిగిలిన మూడు సచివాలయాలు



నందిగంపాడులో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణం

దారవరం, ఊనగట్ల, నెలటూరు పరిధిలో ఎంపిక చేసిన అభివృద్ధి పనులకు నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం

నియోజకవర్గంలో హోంశాఖ మంత్రి తానేటి వనిత నేతృత్వంలో గడప గడపకూ మన ప్రభుత్వం కొనసాగుతోంది. ఆయా గ్రామాల్లో గ్రామస్తుల విజ్ఞాపనల మేరకు అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అవసరమైన చోట రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, ఇతరత్రా మరమ్మతులు చేపడుతున్నారు. సచివాలయాల ద్వారా మంజూరైన రూ.20 లక్షలను ఇందుకోసం ఖర్చు చేస్తున్నారు. ఆ దిశగానే మండలంలోని సచివాలయాల్లో పనులు చేసేందుకు ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు సమయాత్తమయ్యాయి.

నాణ్యతగా పనులు



ప్రస్తుతం సచివాలయాల పరిధిలో చేపట్టిన పనులు నాణ్యతా ప్రమాణాలతో సాగుతున్నాయి. ఈ పనుల పురోగతిని నిత్యం పర్యవేక్షిస్తున్నాం. తేడాలు వస్తే బిల్లులో కోత తప్పదని కాంట్రాక్టర్లకు తెలియజేశాం. ఇప్పటి వరకూ పూర్తయిన పనులన్నింటికీ బిల్లులు పెట్టాం. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాం.

– బి.రాంప్రసాద్, ఎంపీడీవో, చాగల్లు

పరీక్షలంటే భయపడాల్సిన పనిలేదు

- డైట్ లెక్చరర్ గోవిందరాజులు
- టెన్త్ విద్యార్థులకు అవగాహన



పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డైట్ లెక్చరర్ గోవిందరాజులు

నల్లజర్ల: పరీక్షలు అంటే విద్యార్థులు భయపడాల్సిన పని లేదని డైట్ లెక్చరర్ సీహెచ్ గోవిందరాజులు అన్నారు. నల్లజర్ల జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు శనివారం ఆయన పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గోవిందరాజులు మాట్లాడుతూ గతంలో టెన్త్ పరీక్షల్లో ప్రతి సబ్జెక్టుకు రెండేసి పేపర్లు ఉండేవని, ఒకటి సరిగా రాయలేకపోయినా రెండోది బాగా రాస్తే ఉత్తీర్ణులయ్యే అవకాశం ఉండేదన్నారు. నూతన పరీక్షా విధానంలో అలాంటి అవకాశం లేదన్నారు. పరీక్షలపై భయాన్ని పోగొట్టి, మంచి మార్కులు సాధించాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తూ ఈ నెల11 నుంచి 20 వరకూ ప్రతి హైస్కూల్లోనూ టెన్త్ విద్యార్థులకు ఈ తరహా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అక్షర దోషాలు లేకుండా సాధన చేయాలన్నారు. పదజాలంపై పట్టు సాధించి దోషాలు లేకుండా వాక్య నిర్మాణం చేయగలిగితే ఎక్కువ మార్కులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోమలి చిత్ర, ఉపాధ్యాయులు మనోహర కుమార్, పీవీ అప్పారావు, వైఎస్ సాయిబాబు పాల్గొన్నారు.

ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలి

నిడదవోలు: ప్రభుత్వం డీఆర్ ఎరియర్స్, ఆర్‌సీ ఏరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ నిడదవోలు శాఖ అధ్యక్షుడు జీవీ కృష్ణారావు కోరారు. స్థానిక మానవత సంస్థ కార్యాలయంలో శనివారం అసోసియేషన్ నిడదవోలు శాఖ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కుందుల ప్రభాకర్, లక్కు తులసమ్మ, జి. ప్రసాద్, వి.హనుమంతరావు, గాంధీ, ఎం.శేషగిరిరావు, ఎంబీకే వాసుదేవరావు, నాగమణి, రేఖ, టి.రత్నం, హనుమాత్ సుబ్రహ్మణ్యం, పువ్వల మురళీకృష్ణ, శ్రీరామచంద్రమూర్తి, సత్యనారాయణ, షరీఫ్, గండేపల్లి సుబాష్, ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులే జగనన్న రథ సారథులు

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- పెరవలి, ఉండ్రాజవరాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ

నిడదవోలు రూరల్: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులే జగనన్న రథ సారథులని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా పెరవలి దీపికా కన్వెన్షన్ హాల్లో ఆ మండలంలోని గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థతో పాలనను గ్రామస్థాయికి తీసుకువెళ్లారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు కలిసి జగనన్న కుటుంబంలా పనిచేయాలన్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చిత్ర పటానికి పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెరవలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు వీరమల్లు సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు వేండ్ర శ్రీను, మట్టా ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు కొమ్మిశెట్టి రామాంజనేయ, కార్పొరేషన్ డైరెక్టర్ దొడ్డిగర్ల స్వాతి, రామాడుగుల సూరిబాబు, పలువురు



ఉండ్రాజవరం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నిడదవోలు 13వ వార్డులో..

నిడదవోలు: అర్హతే ప్రామాణికంగా కులమతాలు, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో శుక్రవారం రాత్రి పట్టణంలోని 13 వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు చీర్ల రాధయ్య, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు మద్దిపాటి ఫణీంద్ర, అయినీడి పల్లారావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే మీ లక్ష్యం

ఉండ్రాజవరం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కోరారు. మండలంలోని గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్ల అవగాహన సమావేశాన్ని శనివారం ఉండ్రాజవరంలోని సుధీంద్రబాబు ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ముందుగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయ, గ్రామ వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి, ప్రజల వద్దకే పాలన తీసుకు వచ్చిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కరోనా కష్టకాలంలో దేశమంతా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాత్రం అలాంటి లోటు తెలియకుండా రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగించారన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతి రహిత పాలన అందిస్తున్నట్టు చెప్పారు. పార్టీలకు అతీతంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కూడా సంక్షేమ పథకాలను అధించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనను, చేసిన అభివృద్ధిని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. అనంతరం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు నిర్వర్తించాల్సిన విధులపై, రోడ్ల ప్రగతిపై ఎల్‌ఈడీ తెరపై ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, నాయకులు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, కఠారి సిద్ధార్థరాజు, మండలంలోని పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌లో 1,044 కేసుల పరిష్కారం

కొవ్వూరు: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు శనివారం కొవ్వూరు కోర్టులో మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు.నాలుగు బెంచ్‌ల ద్వారా నిర్వహించిన లోక్ అదాలత్‌లో 1,044 కేసులను పరిష్కరించినట్లు జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి పి.అన్నపూర్ణ తెలిపారు. క్రిమినల్ కేసులు 341, సివిల్ 40, బెంచ్ కోర్టు కేసులు 636, ప్రీ లిటిగేషన్ కేసులు 27 పరిష్కరించినట్టు ఆమె తెలిపారు. ఈ కేసుల పరిష్కారం ద్వారా కక్షిదారులకు 1,38,18,687 పరిహారంగా అందజేస్తున్నామన్నారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.ధర్మరావు, సెంకడ్ అడిషనల్ అండ్ జ్యూడీషియల్ అండ్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.శారదాంబ అధ్యక్షతన మూడు బెంచ్‌లు, తాను ఒక బెంచ్ ద్వారా కేసులు పరిష్కరించినట్టు అన్నపూర్ణ వివరించారు.

నిడదవోలు కోర్టులో..

నిడదవోలు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ. కృష్ణప్రసాద్ పలు రకాల కేసులను ఇరు వర్గాల సమ్మతితో పరిష్కరించారు. కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో 121



కొవ్వూరు లోక్ అదాలత్ కక్షిదారులతో మాట్లాడుతున్న జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి అన్నపూర్ణ

క్రిమినల్ కేసులను, ఒక మనోవర్తి కేసును పరిష్కరించి కక్షిదారులకు రూ. 6.41 లక్షలు పరిహారంగా ఇప్పించారు. మరో బెంచ్ కోర్టులో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ. శ్రీనివాస్ 319 కేసులను పరిష్కరించారు. వాటి ద్వారా రూ.91 వేలను కక్షిదారులకు అందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మత్తి అర్జునుడు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నిడదవోలు సీఐ కె. వెంకటేశ్వరరావు, నిడదవోలు, సమిశ్రగూడెం, చాగల్లు ఎస్సైలు పి. నాగరాజు, ఎస్సై ఎస్‌కే సుభానీ, పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్ల నియామకం

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్లు, కో–కన్వీనర్లను నియమించినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) తెలిపారు. శనివారం కన్వీనర్లు, కో–కన్వీనర్ల జాబితాను ఎమ్మెల్యే వెంకట్రావు ప్రకటించారు. గోపాలపురం మండల కన్వీనర్‌గా కొడమంచిలి విజయకుమార్, కో–కన్వీనర్లుగా పసలపూడి రామకృష్ణ, ఎస్‌కే సలీమ్, కాకులపాటి వీరేష్, ముప్పిడి రాము నియమితులయ్యారు. దేవరపల్లి మండల కన్వీనర్‌గా కల్లేపల్లి మాణిక్యం, కో–కన్వీనర్లుగా పెదపాటి చిబాబు, దగ్గుమిల్లి శ్రీనివాస్, టేకుమూడి భీమరాజు, రాపాక ప్రభాకర్ నియమితులయ్యారు. ద్వారకాతిరుమల మండల కన్వీనర్‌గా నిట్టా నాగేశ్వరరావు, కో–కన్వీనర్లుగా నాగస్వర్ల శ్రీనివాస్, దాసరి కృష్ణంరాజు, పిప్పాల రాఘవులు, కోట సునీల్ నియమితులయ్యారు. నల్లజర్ల మండల కన్వీనర్‌గా గొర్రెల సాంబశివనాయుడు, కో–కన్వీర్లుగా ఓలేటి శ్రీను, కడలి నాగరాజు, కనికెళ్లి విల్సన్‌బాబు, అచ్యుతతేజా నాయుడు నియమితులయ్యారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



శ్రీదేవి, భూదేవి సమేత సంతాన వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు (అంతర చిత్రం) కల్యాణాన్ని తిలకిస్తున్న గ్రామస్తులు

దేవరపల్లి: మండలంలోని యాదవోలులో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత సంతాన వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 9వ తేదీ నుంచి ఆలయం వద్ద స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం స్వామి వారికి అర్చన అనంతరం కల్యాణం నిర్వహించారు. అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగాను, స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరించి, పెండ్లి పీటలపైకి తీసుకు వచ్చారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు ఐలూరి సాయి పవన్‌కుమార్ శర్మ, వేదపండితులు కల్యాణం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అనిసెట్టి నరసింహమూర్తి ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. కల్యాణం అనంతరం అన్న సమారాధన చేశారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.



రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు కుమారుడు నిఖిల్ కృష్ణ వివాహానికి హాజరైన రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

చిన వెంకన్నకు వెండి బిందె సమర్పణ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చినవెంకన్నకు ఒక భక్తుడు సుమారు లక్ష రూపాయలు విలువైన వెండి బిందెను సమర్పించారు. తణుకు మండలం సజ్జాపురానికి చెందిన చిరువూరి రాంబాబు, కృష్ణవేణి దంపతులు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శంఖు, చక్ర నామాల డిజైన్‌తో ఉన్న ఈ బిందెను దేవస్థానం ప్రధాన కార్యాలయంలో సూపరింటెండెంట్ వాసు కి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన దాతకు రసీదును అందించారు.

శ్రీవారి సాయంకాలార్చన సమయంలో మార్పు

కుంభ సంక్రమణం సందర్భంగా శ్రీవారి సాయంకాలార్చన సమయాన్ని ఈనెల 13 నుంచి మార్పు చేస్తున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ప్రస్తుతం స్వామివారికి సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు సాయంకాలార్చనను జరుపుతున్నారు. ఈ సమయాన్ని 5.30 నుంచి ఏడు గంటలకు మారుస్తున్నట్టు చెప్పారు. భక్తులకు ఇకపై శ్రీవారి దర్శనం సాయంత్రం 7 గంటల నుంచి లభిస్తుందని, భక్తులు గమనించాలని ఈఓ తెలిపారు.

శ్రీవారి సేవలో జేపీసీ కమిటీ చైర్మన్

చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ జ్యుడీషియల్ ప్రివ్యూ కమిటీ చైర్మన్ జస్టిస్ బి.శివశంకరరావు శనివారం ఉదయం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు.పండితులు శేషవస్త్రం కప్పారు. ఆలయ ఏఈఓ దుర్గారావు స్వామివారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

పెరిగిన నిమ్మకాయల ధరలు

అందుబాటులో లేని సరుకు



నల్లజర్ల మార్కెట్‌కు చేరిన నిమ్మకాయలు

నల్లజర్ల: వారం రోజులుగా నిమ్మకాయల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. గత వారం వరకూ లూజు బస్తా రేటు రూ.1800 నుంచి రూ.2000 వరకూ ఉండేది. ఇపుడు రూ.2500కు పెరిగింది.ధర పెరిగినా రైతుల వద్ద సరుకు లేకుండా పోయింది. ఈశాన్య రాష్ట్రాల్లో కురుస్తున్న మంచు, చలి వాతావరణం వల్ల ఢిల్లీ మార్కెట్‌కు సరకు తరలింపును కొద్ది రోజులపాటు నిలిపివేశారు. అయితే ఇపుడు తిరిగి ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, లక్నో, వారణాసి, కోల్‌కతా తదితర ప్రాంతాలకు ఎగుమతులు జరుగుతున్నాయని నల్లజర్లలో నిమ్మకాయల మార్కెట్ నిర్వాహకుడు ఓంకార రాము తెలిపారు.వర్షాలకు ముందు వచ్చిన కాపు అంతా అయిపోవడంతో కొత్తవి రావడం తగ్గిందన్నారు. దీంతో గిరాకీ పెరిగిందన్నారు. మార్చి, మే నెలల్లో కూడ సరుకు తక్కువగానే ఉంటుందని ఉన్న సరుకుకు ధర బాగా ఉంటుందంటున్నారు. ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు చాలా మంది తోటలు తొలగించి ప్రత్యామ్నాయంగా తక్కువ కాలపరిమితి గల హైబ్రీడ్ రకం 30 నెలల్లో కాపునకు వచ్చే పామాయిల్ తోటలు వేస్తున్నారు.

సర్పంచుల చాంబర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా 'మట్టా'



మంత్రి వనితను కలిసి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న మట్టా వెంకట్రావు

కొవ్వూరు: రాష్ట్ర సర్పంచుల చాంబర్ మెంబర్‌గాను, సర్పంచుల చాంబర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా చాగల్లు మండలం ఊనగట్ల సర్పంచ్ మట్టా వెంకట్రావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా కొవ్వూరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితను శనివారం రాత్రి ఆయన కలసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ చాగల్లు మండల మాజీ కన్వీనర్ బొర్రా కృష్ణారావు, వీరవల్లి శివ, బొర్రా తాతారావు తదితరులు పాల్గొన్నారు.